సాక్షి అనంతపురం

మంగళవారం । 13 । మే । 2025



ఎంసీఏ ఫలితాల విడుదల

జేఎన్‌టీయూ(ఏ) ఎంసీఏ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు.



స్నాతకోత్సవానికి ఆహ్వానం

ఈ నెల 17న జరగనున్న జేఎన్‌టీయూ(ఏ) స్నాతకోత్సవానికి చాన్స్‌లర్, ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను వర్సిటీ ఉన్నతాధికారులు సోమవారం ఆహ్వానించారు.

గరిష్టం/కనిష్టం
41.2°/24.2°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం అధికంగా కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నమో నారసింహా



గోవాహనంపై లక్ష్మీనృసింహుడు

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు సోమవారం గోవాహనం, శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి సుప్రభాతం, మహాభిషేకం, అలంకరణ, బలిహరణ, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహుడిని గోవాహనం, శేష వాహనాలపై కొలువుదీర్చి ఊరేగించారు.

అందుబాటులో 'పది' సప్లి హాల్‌టికెట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ఈనెల 19 నుంచి 28 వరకు జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల లాగిన్ ద్వారా లేదా వాట్సాప్–మనమిత్రా 95523 00009 నంబరు ద్వారా పొందవచ్చని డీఈఓ ఎం.ప్రసాద్ బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. వాట్సాప్‌లో జిల్లా, పాఠశాల, విద్యార్థి, పుట్టిన తేదీ వివరాలు పొందుపరిస్తే హాల్‌టికెట్ వస్తుందన్నారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

ఇంటర్ సప్లి ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 48 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం సెకెండ్ లాంగ్వేజ్ పరీక్షలకు 3,992 మంది విద్యార్థులకు గాను 3,774 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 329 మందికి గాను 317 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగిన పరీక్షలకు 714 మందికి గాను 683 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 119 మందికి గాను 113 మంది హాజరయ్యారు. ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ 5 కేంద్రాలను తనిఖీ చేశారు.

సివిల్ పంచాయితీలు.. సెటిల్‌మెంట్లు

- సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌పై సీపీఐ (ఎంఎల్) నాయకుల ఆరోపణ

అనంతపురం: 'కోర్టులు పరిష్కరించాల్సిన సివిల్ కేసులు, కుటుంబ సంబంధిత సమస్యలపై అనంతపురం వన్ టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీలు నిర్వహిస్తున్నారు. ఇరుపక్షాలపై ఒత్తిడి తీసుకువచ్చి తానే తీర్చేస్తున్నట్లు వ్యవహరిస్తున్నారు' అని సీపీఐ (ఎంఎల్) నాయకులు ఆరోపించారు. సీఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ బాధ్యతారాహిత్యంగా, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ నియంతలా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. సీపీఐ (ఎంఎల్) నాయకుడు వలిని సీఐ బెదిరించడమే కాకుండా దాడి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి టీఎస్ వలి, రాష్ట్ర నాయకుడు వేమన, జిల్లా నాయకులు పరుశురాముడు, వినోద్ కుమార్, పాష వలి, రాము, ఐసా జిల్లా అధ్యక్షుడు శివ కుమార్, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు భీమేష్, ప్యారి తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ హీరోగా నటించిన 'అఖండ' సినిమాలో ఓ ఆసక్తికర సీను అందరికీ గుర్తు ఉండే ఉంటుంది. విలన్ గ్యాంగ్... యురేనియం కోసం తవ్వకాలు జరిపిన అనంతరం వ్యర్థాలను రివర్స్ బోరింగ్ ద్వారా భూమిలోకి వదులుతారు. ఫలితంగా సమీప ప్రాంతాల్లోని పసికందుల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. పంట పొలాలపై కూడా ప్రభావం కనిపిస్తుంది. ఫ్యాక్టరీ వ్యర్థాలు భూమిలోకి వదలడం వల్ల ఎంత ప్రమాదకరమో ఈ సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించారు. అచ్చు అలాంటి పరిస్థితినే ప్రస్తుతం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి, కొడిమి పంచాయతీల ప్రజలు ఎదుర్కొంటున్నారు.

సిఫ్లాన్ భూతం



రాచానపల్లి సమీపంలో ఇటీవల రిపేరీ చేయించిన బోరులో వస్తోంది ఆయిల్ కాదు నీరే..

వ్యర్థాలు భూమిలోకి వదులుతున్న డ్రగ్స్ ఫ్యాక్టరీ

- చుట్టు పక్కల ప్రాంతాల్లో కలుషితమవుతున్న భూగర్భజలాలు
- ఇటీవల రాచానపల్లి పంచాయతీ బోరులో నల్లటి ద్రావకం
- పొగ, దుర్వాసన కూడా వెదజల్లుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సిఫ్లాన్ డ్రగ్స్ ఫ్యాక్టరీ



కుళాయి నుంచి వస్తున్న కలుషిత నీరు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధి బళ్లారి రోడ్డు సమీపంలో ఉన్న ఔషధాల తయారీ సిఫ్లాన్ డ్రగ్స్ ఫ్యాక్టరీ వ్యర్థాలు తీవ్ర ప్రమాదకరంగా మారాయి. ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలను రివర్స్ బోరింగ్ ద్వారా భూమిలోకి వదులుతుండటంతో దుష్పరిణామాలు తలెత్తుతున్నాయి. ఫ్యాక్టరీకి చుట్టుపక్కల 6–7 కిలోమీటర్ల వరకు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సిఫ్లాన్ ఫ్యాక్టరీకి దాదాపు ఒకటిన్నర కిలోమీటరు దూరంలోని చెక్ డ్యాంలో ఉన్న రాచానపల్లి పంచాయతీ బోరు ఇటీవల చెడిపోగా.. రిపేరీ చేయించారు. మోటారు ఆన్ చేయగానే నల్లటి ద్రవం బోరులో నుంచి ఎగజిమ్మింది. రెండు ఇంచుల పైపులో దాదాపు రెండు గంటల పాటు ఇదే పరిస్థితి. ఈ బోరు 250 అడుగుల లోతు ఉంది. దీన్ని బట్టి రసాయన వ్యర్థాల ప్రభావం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తీవ్ర అవస్థలు..

'సిఫ్లాన్' భూతం కారణంగా రాచానపల్లి, కొడిమి పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాచానపల్లి పంచాయతీలో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కలుషితమై వస్తోందని మహిళలు వాపోతున్నారు. తాగేందుకు ఏమాత్రమూ ఉపయోగపడడం లేదని, దుస్తులు ఉతకడానికి కూడా వినియోగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పంట భూముల్లోనూ డ్రగ్స్ వ్యర్థాల అవశేషాల ప్రభావం పడిందంటున్నారు. దీనికితోడు పొగ, దుర్వాసన వెదజల్లుతుండడంతో అవస్థలు పడుతున్నామంటున్నారు.

వ్యర్థాలు భూమిలోకి వదులుతుండటంతోనే..



సిఫ్లాన్ డ్రగ్స్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలను భూమిలోకి వదులుతుండడంతో ఆ ప్రభావం మా పంచాయతీపై పడింది. కనీసం రెండు గంటల పాటు నీళ్లు నల్లగా వస్తున్నాయి. 15 రోజుల క్రితం చెక్‌డ్యాం వద్ద బోరు రిపేరీ చేయించి ఆన్‌చేస్తే రెండు ఇంచుల పైపులో గంటలపాటు కలుషిత నీళ్లు వచ్చాయి.

– బండా అంజియాదవ్, సర్పంచ్, రాచానపల్లి

నీళ్లు కొని తాగుతున్నాం



“ గతంలో పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటినే తాగేవాళ్లం. ఈ మధ్య కాలంలో కుళాయిలో నీళ్లు చాలా కలుషితమై వస్తున్నాయి. నల్లటి రంగులో ఉంటూ వాసన వస్తోంది. దీంతో తాగేందుకు ఫిల్టర్ నీరు తెచ్చుకుంటున్నాం.

– రాములమ్మ, సిండికేట్ నగర్, రాచానపల్లి పంచాయతీ

పట్టించుకోవడం లేదు



కుళాయిల్లో వస్తున్న పంచాయతీ నీరు తాగేందుకు ఉపయోగపడవు. ఒక్కోసారి డ్రమ్ములు డ్రమ్ముల నీళ్లు వదిలేసినా నల్లరంగు మాత్రం తగ్గడం లేదు. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

–ఈశ్వరమ్మ సిండికేట్‌నగర్, రాచానపల్లి పంచాయతీ

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

సిఫ్లాన్ డ్రగ్స్‌పై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తాం. గతంలో ఈ సంస్థపై ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) లోనూ కేసు నమోదై ఉంది. దానిపైనా విచారణ జరుగుతోంది. కంపెనీ పరిసర గ్రామాల్లో కలుషిత నీటిపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకుంటాం.

–ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, కాలుష్యనియంత్రణ మండలి

నేడు కల్లితండాకు వైఎస్ జగన్



సాక్షి, పుట్టపర్తి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గోరంట్ల మండలం కల్లితండాకు రానున్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా జమ్ముకాశ్మీర్‌లో శత్రుమూకలను తుదముట్టిస్తూ వీరమరణం పొందిన జవాన్ ముడావత్ మురళీ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఉదయం 9.30 గంటలకు బెంగళూరులోని నివాసం నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో చిక్కబళ్లాపురం, కొడికొండ చెక్‌పోస్టు, పాలసముద్రం, గుమ్మయ్యగారిపల్లి మీదుగా 11.30 గంటలకు కల్లితండాకు చేరుకుంటారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నివీర్ మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయిను పరామర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరుకు తిరుగు పయనం అవుతారు.

జయప్రదం చేద్దాం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను జయప్రదం చేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కొడికొండ చెక్‌పోస్టుకు వైఎస్ జగన్ చేరుకుంటారని, పార్టీ శ్రేణులు ఆ సమయానికంతా కొడికొండ చెక్‌పోస్టు వద్దకు చేరుకోవాలని 'అనంత' కోరారు.

ఇంటింటా చెత్తసేకరణ తప్పనిసరి

అనంతపురం అర్బన్: జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ఇంటింటా చెత్త సేకరణ తప్పనిసరిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం చేస్తే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల వేడుకోలు
- వివిధ సమస్యలపై 360 వినతులు



ఈమె పేరు సుబ్బమ్మ. గార్లదిన్నె మండలం శిరివరంవాసి. ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. పది సంవత్సరాల క్రితం సుబ్బమ్మ భర్త చనిపోయాడు. కుమారుడు రేవంత్‌కు పుట్టుకతోనే కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. సదరం క్యాంపులో 100 శాతం వైకల్యం ఉందని సర్టిఫికెట్ మంజూరు చేశారు. ప్రభుత్వం పింఛన్ రూ.6 వేలే అందిస్తోంది. సుబ్బమ్మ కుటుంబానికి భూమి లేదు. రోజు కూలీ పనులకెళ్తేనే కుటుంబ జీవనం సాగుతుంది. ఈ క్రమంలో కుమారుడికి రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని సుబ్బమ్మ పలు మార్లు మండల అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో గార్లదిన్నెలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించింది.



గార్లదిన్నెలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణి

గార్లదిన్నె: 'వివిధ ప్రాంతాల నుంచి ఎంతో ఆశతో మీ వద్దకు వచ్చి అర్జీలు ఇస్తున్నాం. ఇప్పటికే ఐదు, ఆరు సార్లు అర్జీలిచ్చాం. ఇప్పటికైనా పట్టించుకుని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి' అంటూ పలువురు అర్జీదారులు వేడుకున్నారు. సోమవారం గార్లదిన్నె మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, డీఆర్‌ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, తిప్పేనాయక్, మల్లికార్జున, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 360 వినతులు అందాయి. అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పదే పదే వస్తున్న అర్జీలను పరిష్కరించే బాధ్యతను జేసీకి అప్పజెబుతామని, ఇందులో అధికారుల తప్పు ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవన్నారు. గ్రామ, క్షేత్ర స్థాయి అధికారులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అమర జవాన్ 'అగ్నివీర్ మురళీ నాయక్'కు ఘన నివాళులర్పించారు.

వినతుల్లో కొన్ని...

- చీనీ మార్కెట్ యార్డులో ఈ నామ్ వ్యవస్థను రద్దు చేసి వేలం ద్వారా అమ్మకాలు జరపాలని, సూట్ విధానం రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు చెన్నారెడ్డి, ఓబిలేసు, సంగప్ప విన్నవించారు.
- గార్లదిన్నె నుంచి మర్తాడు, కోటంక వరకు తారు రోడ్డు అధ్వానంగా ఉందని, నూతనంగా రోడ్డు వేయాలని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఆయా గ్రామస్తులు కోరారు.
- కొప్పలకొండ గ్రామంలో సీసీ రోడ్డుపై రాకపోకలు సాగించకుండా ఓ వ్యక్తి ట్రాక్టర్లు, బొలెరో వాహనాలు అడ్డు పెడుతున్నారని గ్రామానికి చెందిన నాగరాజు ఫిర్యాదు చేశాడు.
- గార్లదిన్నె డిప్యూటీ తహసీల్దార్ రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని, డబ్బు ఇస్తేనే పనులు చేస్తున్నారని రైతు సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు.
- ఎమ్మెల్యే అక్రమ కేసులు పెట్టించి, అవమానాలకు గురి చేస్తోందని, న్యాయం చేయాలని కనంపల్లికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త కలెక్టర్‌కు విన్నవించారు.


ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అధికారులు, ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న తరుణంలోనూ సరిపడా ఫ్యాన్లు ఏర్పాటు చేయకపోవడంతో టెంట్ల కింద ఉక్కపోతతో నలిగిపోయారు. పేపర్లను ఊపుకుంటూ ఉపశమనం పొందారు.

ఖాకీలు.. సమిధలు

- నిన్నటికి నిన్న హోటల్ రూమ్ ఇవ్వలేదని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.. పోలీసులతో రైడ్ చేయించారు. ఇందులో టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ ఆవేశంతో హోటల్‌కు వెళ్లి అణువణువు గాలించారు. అకారణ రైడ్స్‌తో ఇప్పుడు శ్రీకాంత్ అందరి దృష్టిలో పడ్డారు.
- ఎంపీపీ ఉప ఎన్నికల సమయంలో రామగిరి ఎస్ఐ సుధాకర్ టీడీపీ కార్యకర్తలా వ్యవహరించారు. రామగిరి ఎంపీపీ పోస్టు టీడీపీకి దక్కేలా విశ్వ ప్రయత్నాలు చేశారు. ఇప్పటికీ ప్రత్యర్థి పార్టీల నేతలను వేధిస్తున్నారు. పరిస్థితి చేయిదాటితే ఈయన ఉద్యోగం పరిస్థితి ఏమిటన్నది డాలర్ల ప్రశ్న.
- రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్.. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆర్డరేస్తే చాలు అది తప్పో ఒప్పో చూడకుండా పని చేస్తున్నారు. ఇప్పుడు జయనాయక్ వ్యవహారాలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

- ఎమ్మెల్యేలు చెప్పినట్టు తలూపుతున్న పలువురు సీఐలు
- తేడా వస్తే పోలీసులనే బుక్ చేస్తున్న ప్రజాప్రతినిధులు
- మొన్న కరుణాకర్‌ను వీఆర్‌కు పంపిన ఎస్పీ
- నిన్న 'చిల్లర ఏరుకునే వాడు' అంటూ సీఐ సాయిప్రసాద్‌కు మంత్రి చీవాట్లు
- ఈ ఘటనలపై నోరు మెదపని పోలీసు సంఘం
- ఎస్పీ నుంచి కనీస మద్దతు లేదని పోలీసుల ఆవేదన



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసుల్లో నైరాశ్యం నెలకొంది. ఏం చేస్తే ఏ ముప్పు ముంచుకొస్తుందోనని క్షణక్షణం ఆందోళన చెందుతున్నారు. తాము చెప్పిందల్లా చేయాలని ఆదేశిస్తున్న ఎమ్మెల్యేలు.. తేడా వస్తే పోలీసులనే బుక్ చేస్తున్నారు.

లక్ష్మీకాంత్ నుంచి సాయిప్రసాద్ వరకూ..

కూటమి సర్కారు వచ్చిన తొలి రోజుల్లో తాడిపత్రి సీఐ లక్ష్మీకాంతరెడ్డితో ఆయన చేయని తప్పునకు ఎస్పీ పట్టుబట్టి మరీ ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పించారు. ఆ తర్వాత లక్ష్మీకాంతరెడ్డి జిల్లాలో పని చేయడానికే ఇష్టపడలేదు. ఇటీవల తాడిపత్రి సీఐ సాయిప్రసాద్‌ను స్వయానా మంత్రి సత్యకుమార్ యాదవ్... 'నువ్వు చిల్లర ఏరుకునే వాడివి, నీ అంతు చూస్తా' అంటూ బెదిరించారు. మంత్రి వాడిన భాషపై పోలీసు ఉన్నతాధికారులు కనీసం స్పందించలేక పోయారు.

వాడుకుని వదిలేస్తారంతే..

బుక్కరాయ సముద్రం సీఐగా ఉన్న కరుణాకర్‌ను ఉన్నతాధికారులు కొన్ని రోజుల క్రితం వీఆర్‌కు పంపించారు. టీడీపీ కార్యకర్తను మందలించారన్న కారణంగా నలుగురు టీడీపీ కార్యకర్తలు స్టేషన్ ఎదుట జెండాలతో ధర్నా చేయగానే ఒక్కరోజులోనే ఆయన్ని వీఆర్‌కు సాగనంపారు. కరుణాకర్ ఉన్నన్నాళ్లు ఎమ్మెల్యేలు బాగా పనిచేయించుకున్నా తమకు నచ్చకపోతే మాత్రం వీధిలో పడేశారు.

జిల్లాలో పోలీసు సంఘం ఉందా?

రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో ఇటీవల కురుబ లింగమయ్య హత్యానంతరం బాధిత కుటుంబాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "తప్పు చేసిన పోలీసులను" బట్టలూడదీసి నిలబెడతామని హెచ్చరించారు. ఆయన తప్పు చేసే వారిని ఉద్దేశించి మాత్రమే మాట్లాడినప్పటికీ పోలీసు సంఘం స్పందించింది. అయితే, సీఐ సాయిప్రసాద్‌ను మంత్రి సత్యకుమార్ తిట్టినప్పుడు అదే సంఘం ఎక్కడుందన్న విమర్శలు వెల్లువెత్తాయి. పదిహేనేళ్లుగా యూనిఫాం వేసుకోని సంఘం నేత త్రిలోక్ ఎక్కడున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. దళిత అధికారి కరుణాకర్‌ను బదిలీ చేసినప్పుడు కూడా వీళ్లేమయ్యారో తెలియడం లేదని అంటున్నారు.

బాస్ సపోర్టు నిల్..

పోలీసులకు ఏదైనా రాజకీయంగా సమస్య వస్తే తక్షణమే స్పందించి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఎస్పీలది. కానీ జిల్లాలో అలాంటి సపోర్టు లేకపోవడంతో సీఐల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎమ్మెల్యేల మెప్పుకోసం ఏదిపడితే అది చేస్తే ఇబ్బందులొచ్చాక కాపాడేవారు లేరన్న చర్చ పోలీసు వర్గాల్లో జరుగుతోంది.

మాజీ ఎంపీ దరూర్ పుల్లయ్య కన్నుమూత

- జిల్లాకు సాగు, తాగునీటి కోసం పోరాడిన యోధుడిగా గుర్తింపు



వజ్రకరూర్, ఉరవకొండ: వజ్రకరూరు మండలం ఛాయపురం గ్రామానికి చెందిన మాజీ పార్లమెంట్ సభ్యులు దరూర్ పుల్లయ్య (93) కన్నుమూశారు. సోమవారం బళ్లారి సమీపంలోని కంప్లి వద్ద ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలో పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుకు గురై ఆయన ప్రాణాలు విడిచారు. దరూర్ పుల్లయ్య 1932 జూన్ 20న ఛాయపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. ఈయనకు భార్య సత్యవతితో పాటు కుమారుడు దరూర్ రమేష్, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. మద్రాసులోని లా కళాశాలలో దరూర్‌పుల్లయ్య బీఏ, బీఎల్ పూర్తి చేశారు. ఆ తరవాత రాజకీయాల్లోకి ప్రవేశించి 1969 నుంచి 1974 వరకు ఛాయపురం సర్పంచ్‌గా సేవలందించారు. ఉరవకొండ సమితి అధ్యక్షులుగా నియోజకవర్గంలో మంచి నీటి ట్యాంకులు, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. 1962లో సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. 1977, 1980 ఎన్నికల్లో ఎంపీగా ఎన్నికయ్యారు. అప్పట్లో పార్లమెంట్‌లో రాష్ట్ర ఎంపీల కన్వీనర్‌గా వ్యవహరించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. 1976 నుంచి 1995 వరకు అనంతపురం ఏపీ లైటింగ్ ఎండీగా, కర్ణాటకలోని కంప్లి షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గానూ పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారు. నీటి పారుదల రంగంలో నిష్ణాతుడిగా పేరుగాంచిన దరూర్ పుల్లయ్య జిల్లాలో తాగు, సాగునీటి కల్పన కోసం విశేష కృషి చేశారు. హంద్రీ–నీవా సాధన సమితిలో క్రియాశీలకంగా వ్యవహరించారు. దరూర్ పుల్లయ్య మృతితో ఆయన స్వగ్రామం ఛాయపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సన్నిహితులు, బంధువులు, గ్రామస్తులు ఆయన సేవలను గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

సాగు, తాగునీటి కోసం కృషి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మృతికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సంతాపం తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దరూర్ పుల్లయ్య కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం రాజకీయ జీవితాన్ని గడిపారని గుర్తు చేశారు. రాయలసీమకు సాగు, తాగునీటి కోసం దరూర్ పుల్లయ్య కృషి చేశారన్నారు. అనేక ఉద్యమాల్లోనూ ఆయన కీలకంగా వ్యవహరించారన్నారు. పార్లమెంటులో రాయలసీమ సమస్యలపై గళమెత్తారన్నారు. ఆయన మృతి జిల్లాకు తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

- దరూర్‌పుల్లయ్య మృతికి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి సంతాపం తెలిపారు. భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

విశ్రాంత తహసీల్దారు పెన్షన్‌లో కోత

- వెబ్‌ల్యాండ్‌లో అవకతవకలకు పాల్పడిన ఫలితం

అనంతపురం అర్బన్: విశ్రాంత తహసీల్దారు అన్వర్ హుస్సేన్ పెన్షన్‌లో 2 శాతం కోత విధిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం తహసీల్దారుగా అన్వర్ హుస్సేన్ పనిచేసిన సమయంలో అనంతపురం మండలం కొడిమి గ్రామం సర్వే నంబరు 98, 123, 136, 149కు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో అవకతవకలకు పాల్పడి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేసినట్లు ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ చేసిన జాయింట్ కలెక్టర్.. మూడు చార్జెస్ నిరూపణ కాలేదని, ఒకటి పాక్షికంగా నిరూపణ అయినట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ క్రమంలో అన్వర్‌హుస్సేన్ పెన్షన్‌లో ఏడాది పాటు 2 శాతం కోత విధించింది. మరో విశ్రాంత తహసీల్దారు మహబూబ్‌బాషాపై చార్జెస్ నిరూపణ కాకపోవడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

క్లుప్తంగా

26 నుంచి అగ్నివీర్ మురళీనాయక్ స్మారక క్రికెట్ టోర్నీ



వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం నగర డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్ స్మారకార్థం ఈ నెల 26 నుంచి అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, అనంతపురం నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడా జట్లు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 80085 50464, 79893 69100, 73969 27271, 98855 31051, 94407 58953లో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి

తాడిపత్రి టౌన్: ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎస్టీయూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం చేపట్టనున్న ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చేయకుండా పారదర్శకత పాటించాలన్నారు. ప్రతి యూపీ పాఠశాలలో నిబంధనలకు అనుగుణంగా పోస్టులు కేటాయించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఇచ్చిన గ్రీవెన్స్‌ను క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజినేయులు, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, తిరుపాల్‌నాయుడు, శివచంద్ర, డేనియల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



రాయదుర్గం టౌన్: స్థానిక కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దేవేరులతో కలసి సూర్యప్రభ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. అనంతరం సాయంత్రం సింహ వాహన సేవలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శేష వాహనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

ప్ర'గతి' తప్పిన హెచ్చెల్సీ

- పర్యవేక్షణ అధికారి లేకపోవడంతో నిర్వీర్యమవుతున్న బృహత్తర ప్రాజెక్ట్
- కనీసం ఇన్‌చార్జ్ ఎస్ఈని నియమించని కూటమి సర్కార్
- నానాటికీ ప్రశ్నార్థకమవుతున్న ఆయకట్టు సాగు



హెచ్చెల్సీ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)ను ప్రాజెక్టును కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తోంది. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో మొత్తం 2.85 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందించే ఈ బృహత్తర ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు అధికారిని నియమించకపోవడమే ఇందుకు నిదర్శనం. గతంలో హెచ్చెల్సీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ (ఎస్ఈ)గా పనిచేసిన రాజశేఖర్ పదవీ కాలం ముగియడంతో గత నెలాఖరున ఆయన ఉద్యోగ విరమణ చేశారు. కీలకమైన ఖరీఫ్ సీజన్ ఆరంభం కానున్న ప్రస్తుత తరుణంలో ఉన్నతాధికారి పోస్టు భర్తీపై నీలినీడలు కమ్ముకున్నాయి. కనీసం ఇన్‌చార్జ్ ఎస్ఈ నియామకంపై కూడా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకమవుతోంది. ఇప్పటికే దాదాపు రూ.30 కోట్లకు పైగా నిధులతో కల్వర్టులు, శిథిలావస్థకు వచ్చిన తూముల మరమ్మతులు జరుగుతున్నాయి. వీటిని పర్యవేక్షించి పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాల్సిన జిల్లా స్థాయి అధికారి నియామకంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం అభివృద్ధి పనులు గతి తప్పాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మరమ్మతులకు మంచి అవకాశం

జిల్లాకు వరదాయినిగా ఉన్న హెచ్చెల్సీ ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా కేవలం గ్రావిటీ ద్వారానే కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ నుంచి నీరు అందుతోంది. హెచ్చెల్సీ పరిధిలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో మొత్తం 2.85 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఒక్క అనంతపురం జిల్లాలోనే 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులకు ఆదాయ మార్గాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఎస్ఈ స్థాయి అధికారులు సైతం ఇక్కడ పనిచేయడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదని తెలుస్తోంది. త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోంది. ఈసారి నైరుతీ రుతుపవనాలు తొందరగానే పలకరిస్తాయని శాస్త్రవేత్తలూ పేర్కొంటున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే తుంగభద్ర డ్యాం ద్వారా ఈ సారి భారీగా నీరు అందే అవకాశమూ ఉంది.

అతిథి గృహంలోనే విధులు

జిల్లా కేంద్రంలో హెచ్చెల్సీ కార్యాలయానికి దిక్కు లేకుండా పోయింది. గతంలో తెలుగుతల్లి విగ్రహం వద్ద ఉన్న కార్యాలయం ప్రభుత్వాసుపత్రికి కేటాయించడంతో అక్కడున్న కార్యాలయాన్ని దశాబ్దాల క్రితం కిత్రం నిర్మించిన అతిథి గృహానికి మార్చారు. హెచ్చెల్సీకి నూతన కార్యాలయం నిర్మాణం ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదు. దీంతో రెండేళ్లుగా అతిథిగృహం ఇరుకు గదుల్లోనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ స్పందించి హెచ్చెల్సీకి పూర్వ వైభవం కల్పించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇలాంటి కీలక సమయంలో కాలువ మరమ్మతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తుంగభద్ర డ్యామ్ నుంచి 100 కిలోమీటర్ల వరకూ కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉంది. ఆ తర్వాత పులివెందుల వరకూ నీటిని అందించాలంటే కాలువ పటిష్టత మరింత మెరుగుపడాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కాలువలో మరమ్మతులు, ముళ్ల కంపలు తొలగించడానికి నీటి ప్రవాహం లేని ప్రస్తుత తరుణమే మంచి అవకాశమని పేర్కొంటున్నారు.

నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాలు సేకరించాలి : ఎస్పీ



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: నేరస్తులకు పక్కాగా శిక్షలు పడాలంటే నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాలు సేకరించాలని సిబ్బందికి ఎస్పీ పి.జగదీష్ సూచించారు. 'ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్''పై పోలీసు అధికారులకు సోమవారం సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. నేర స్థలంలో ఆధారాల సేకరణ, వాటి ప్యాకేజింగ్, భద్రతా ప్రమాణాలు, సిరాలజీ, డీఎన్ఏ, టాక్సికాలజీ, సైబర్ ఫోరెన్సిక్స్ వంటి విభాగాల్లో నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు నేరస్తులు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారని, అలాంటి వారిని సమర్థవంతంగా పట్టుకుని చట్టం ద్వారా శిక్షలు వేయించాలంటే ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. వివిధ అంశాలపై అనంతపురం ఆర్ఎఫ్ఎస్ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజా రంగనాథ రెడ్డి, ఫోరెన్సిక్ సైంటిఫిక్ ఆఫీసర్ సుధారాణి, సైంటిఫిక్ అసిస్టెంట్లు మురళి, వెంకటేశ్వరరావు తదితరులు అవగాహన కల్పించారు.

అధైర్య పడొద్దు... అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలకు శింగనమల సమన్వయకర్త శైలజనాథ్ భరోసా



కోమటికుంట్లలో ఎరికలయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ శైలజనాథ్

పుట్లూరు: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఆ పార్టీ శింగనమల నియోజకర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ భరోసానిచ్చారు. పుట్లూరు మండలం కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కోమటికుంట్లలో టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన ఎరికలయ్య కుటుంబాన్ని, అనంతరం గరుగుచింతపల్లిలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పెద్దన్న , నాగరాజును పరామర్శించారు. గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద మద్యం విక్రయించరాదన్నందుకు విచక్షణారహితంగా దాడికి పాల్పడినట్లు పెద్దన్న కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శైలజనాథ్ మాట్లాడుతూ... ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు సేవ చేయాలని, అభివృద్ధి చేసి చూపించి గొప్పగా చెప్పుకోవాలి తప్ప ఇలా దాడులు చేసి పైశాచిక అనందం పొందడం భావ్యం కాదన్నారు. అధికారం ఉంది కదా అని చట్ట వ్యతిరేకంగా నడుచుకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గరుగుచింతపల్లి గ్రామంలో జరుగుతున్న పరిణామాలపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి బాధితులకు అండగా నిలుస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీపీ బి.రాఘవరెడ్డి, సర్పంచ్‌లు ఓబులేసు, రామకృష్ణారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు రామమోహన్‌రెడ్డి, జేఆర్‌పేట మహేశ్వరరెడ్డి, విష్ణునారాయణ, శింగనమల ప్రసాద్, పోలిరెడ్డి, వెంకటశివుడు, కృష్ణయ్య, సూరి తదితరులు ఉన్నారు.

వీరజవాన్ మురళీనాయక్ త్యాగం జాతి మరవదు

గోరంట్ల: వీర జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని భరత జాతి ఎన్నటికీ మరిచిపోదని డాక్టర్ సాకే శైలజనాథ్ అన్నారు. సోమవారం గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకున్న ఆయన మురళీనాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాంనాయక్‌ను పరామర్శించారు. అనంతరం వీరజవాన్ మురళీనాయక్ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శత్రుమూకలతో మురళీనాయక్ సాగించిన వీరోచిత పోరాటాన్ని కొనియాడారు.

యువరైతు బలవన్మరణం



సుధాకర్ (ఫైల్)

విడపనకల్లు: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువరైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు.. విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన రైతు బోయ సుధాకర్(27)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. గత రెండేళ్లుగా మిరప పంట సాగు చేస్తున్నాడు. సరైన దిగుబడి రాకపోవడంతో పాటు దిగుబడి ఉన్న సమయంలో గిట్టుబాటు ధర లేకపోవడంతో పంట సాగు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ కుటుంబసభ్యులతో చెప్పుకుని బాధపడే సుధాకర్.. సోమవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

భూసేకరణ ప్రతిపాదనలు పంపండి

- అధికారులతో జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియ ప్రతిపాదనలను త్వరితగతిన పంపించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. భూ సేకరణ అంశంపై సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. జాతీయ రహదారులు 544డి, 67, 150తో పాటు రైల్వే, ఇతర ప్రాధాన్యత ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, భూ బదలాలియింపుపై పెండింగ్ ప్రతిపాదనలు జాతీయ రహదారి అధికారులకు పంపించాలని ఆర్‌డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. ప్రాజెక్టుల భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎన్‌హెచ్ పీడీ తరుణ్‌కుమార్, భూ విభాగం సూపరిటెండెంట్ రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెరువు మట్టినీ బొక్కేస్తున్నారు...



చిత్రచేడులోని మదురవంక చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామంలో మట్టి దందాకు స్థానిక టీడీపీ కార్యకర్తలు తెరలేపారు. గత రెండు రోజుల క్రితం తగ్గు ప్రాంతాలను చదును చేసేందుకు గ్రామంలోని రెండు వర్గాల వారు జేసీబీలతో మట్టిని తరలించేందుకు ప్రయతి్నంచడంతో అధికారులు తక్షణమే స్పందించి అడ్డుకున్నారు. ఇదే అదునుగా చేసుకుని గ్రామంలోని టీడీపీ కార్యకర్తలు ఏకంగా పది ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని, చెరువులోని మట్టిని జేసీబీలతో పెకలించి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పార్టీ పెద్దల పేర్లు చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలోనే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే టీడీపీ బడా నేత ఫోన్ చేయడంతో వాటిని అక్కడే వదిలేసి వచ్చారు. కాగా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చెరువులోని మట్టిని తరలిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జనాన్ని కంట్రోల్ చేసిన నాపై కేసులా?

- పాపిరెడ్డిపల్లి హెలిప్యాడ్ ఘటన పోలీసుల వైఫల్యమే
- సంబంధం లేని నాపై కేసు పెట్టారు
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: '' టీడీపీ నేతల చేతుల్లో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి గత నెల 8న హెలికాప్టర్‌లో తమ నాయకుడు వైఎస్ జగన్ వస్తే హెలిప్యాడ్ వద్ద తగినంత మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రజలు హెలికాప్టర్ వరకూ దూసుకెళ్లారు. నేనే మైక్ తీసుకుని వారిని కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించాను. అయినా అభిమానులు దూసుకెళ్లడంతో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతినింది. ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమే. కానీ జనాన్ని కంట్రోల్ చేసిన నాపై కేసు పెట్టారు'' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి హెలిప్యాడ్ సంఘటనకు సంబంధించి సోమవారం చెన్నేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన విచారణకు ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. లింగమయ్యను అగ్రకులాలకు చెందిన వారు కొందరు హత్య చేసినా... వారిపై కేసులు నమోదు చేయకుండా పోలీసులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ హత్యలో ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత కుమారుడు, బంధువులు హస్తం ఉందని తోపుదుర్తి ఆరోపించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులతో గొడవలు జరిగాయని, తర్వాత పరిటాల సునీత కుమారుడు పరిటాల శ్రీరామ్ దాడికి పాల్పడిన వారితో కలిశారన్నారు. ఈ విషయాన్ని కొన్ని మీడియాలు తప్పుదోవ పట్టించే విధంగా రకరకాలుగా ప్రసారం చేశాయన్నారు. వాస్తవాన్ని వదలి ప్రజల దృష్టిని మరల్చే విధంగా కొన్ని మీడియా సంస్థలు వ్యవహరించాయన్నారు. హెలిప్యాడ్ వద్ద ఎక్కువ జనం రావడంతో పోలీసు ఉన్నతాధికారి సూచన మేరకు తాను మైక్ ద్వారా సంయమనం పాటించాలని హెలిప్యాడ్ వద్దకు వెళ్లరాదని సూచించారన్నారు. ఇవన్నీ వదిలి నాపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలు తిరగబడే రోజు దగ్గరలో ఉంది..

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు ఎక్కువయ్యాయని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. అభివృద్ధి చేయడం మాని, రక్తపాతం సృష్టిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఆయన ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ప్రకాష్‌రెడ్డి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రా రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డితో పాటు పలువురు ఎంపీటీసీలు ఉన్నారు.

ముగ్గుపై బైక్ పోనిచ్చాడంటూ దాడి

యాడికి: ముగ్గుపై ద్విచక్ర వాహనం పోనివ్వడంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు దాడికి తెగబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి ఇంటి ఎదుట ఆయన కోడలు కల్పన ఆదివారం ముగ్గు వేసింది. అదే సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న శంకరరెడ్డి అనుకోకుండా ముగ్గుపై వాహనాన్ని పోనిచ్చాడు. దీంతో ముగ్గు చెదిరిపోవడంతో శంకర్‌రెడ్డితో నాగిరెడ్డి, ఆయన కుమారుడు శివశంకరరెడ్డి, కల్పన వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరగడంతో శంకర్‌రెడ్డిపై దాడి చేశారు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీటీ పరిరక్షణకు చర్యలు : కలెక్టర్



నిమ్మరసం ఇచ్చి ఆందోళనను విరమింపజేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీ పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. 'సేవ్ ఆర్డీటీ' పేరుతో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి ఎనిమిదోవ రోజు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని కలెక్టర్ సందర్శించి, అఖిలపక్ష కమిటీ సభ్యులతో మాట్లాడారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సీఎం పర్యటనలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించానన్నారు. సుదీర్ఘ కాలం పాటు పేదలకు నిస్వార్థ సేవలు అందించిన ఆర్డీటీ పరిరక్షణ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ కోసం 8 రోజులుగా దీక్షలు చేస్తున్నారంటే మామూలు విషయం కాదన్నారు. ఓ మంచి పని కోసం ఉద్యమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. అఖిల పక్ష కమిటీ నాయకులు సాకే హరి మాట్లాడుతూ.. ఆర్డీటీ సేవలు కొనసాగేలా కలెక్టర్ చేయగలరని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాకపోతే కుల, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్ని అన్నారు. కార్యక్రమంలో కేపీ రాజు, కోట్ల గంగాధర్, సుగమంచి శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, ఓబులేసు, టీపీ రామన్న, అనిల్‌కుమార్, కొత్తపల్లి సురేష్, నారాయణ నాయక్, బండారు కుళ్లాయప్ప , నరసింహులు, షఫీ, వన్నూరప్ప, హరినాథరెడ్డి, గోపాలకృష్ణ, తరిమెల రాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువంతా తామర పూలు..

అసలే కరువు జిల్లా. దీనికితోడు ఎండలు దంచికొడుతున్నాయి. అయినా మండుటెండలో విరబూసిన తామర పూలను చూస్తూ ప్రజలు మైమరచిపోతున్నారు. అనంతపురం నగరాన్ని ఆనుకుని ఉన్న బుక్కరాయసముద్రం చెరువులోని దృశ్యం ఇది. చెరువులో దాదాపు సగభాగం వరకూ నీటిపై తేలియాడుతున్న ఆకుల మధ్య వందల సంఖ్యలో తామర పూలు చూపరులకు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఆ టీచర్లకు ప్రాధాన్యతనివ్వాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలు, హేతుబద్ధీకరణకు రూపొందించిన నిబంధనల్లో స్టేషన్ పాయింట్లకు సంబంధించి ఒక పాఠశాలలో 8 ఏళ్ల పూర్తి కాకుండానే రేషనలైజేషన్‌కు గురవుతున్న టీచర్లకు 8 ఏళ్ల పూర్తి పాయింట్లు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసనాయక్ మాట్లాడారు. సీనియర్/జూనియర్ ఎవరు రీ అపోర్షన్‌కు గురైనా రీఅపోర్షన్ పాయింట్లు కేటాయించాలన్నారు. ఎస్జీటీ లకు పీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించి మోడల్ ప్రైమరీ పాఠశాలలకు నియమించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల శాతాన్ని 1:45 ప్రకారం నిర్ధారిస్తూ పోస్టులు కేటాయించాలన్నారు. బదిలీ పాఠశాలల్లో పోస్టులు బ్లాక్ చేయరాదన్నారు. ఇంగ్లిషు తదితర సబ్జెక్టుల సీనియార్టీ లిస్టు ఫైనలైజ్ చేసి.. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించిన తర్వాతనే మిగులు పోస్టులు ప్రకటించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, సత్యప్రసాద్, అశోక్ నాయక్, వజీర్ బాషా, నారాయణ నాయక్, దామోదర్ రామాంజనేయులు, హుసేన్‌ఖాన్ పాల్గొన్నారు.

లోదుక్కులతో లాభాలెన్నో..

- శాస్త్రవేత్తలు విజయ శంకరబాబు, నారాయణస్వామి సూచనలు



నేల, నీటి సంరక్షణకు వేసవి దుక్కులు, కాంటూరు సేద్యపు పనులు ఇలా

పాడి పంట

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కురిసిన వర్షాలను ఉపయోగించుకుని వేసవిలో లోతుగా దుక్కులు చేసుకుంటే ఖరీఫ్ పంటలకు చాలా మేలు జరుగుతుందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకర బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. మెట్ట పొలాలు అధికంగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం లాభసాటి కావాలంటే రైతులు ముందస్తు సేద్యపు పనులు చేసుకోవాలన్నారు. అందులో భాగంగా పొలాల్లో వాలుకు అడ్డంగా దున్నడం, నేల, నీటి సంరక్షణకు వాన నీటిని ఎక్కడికక్కడ ఇంకేలా 'కాంటూరి సేద్యపు పనులు చేసుకోవాలని సూచించారు.

75 శాతం వర్షాధారం

జిల్లాలో 75 శాతం విస్తీర్ణం వరకు వర్షాలపై (మెట్ట సేద్యం) ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఎక్కువగా ఎర్ర, చల్కా నేలలు ఉన్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలపై ఉమ్మడి జిల్లా పరిధిలో 7 నుంచి 8 లక్షల హెక్టార్ల ఖరీఫ్ ఆధారపడి ఉంది. రుతుపవనాలు నిర్ణీత సమయం కన్నా ముందుగా లేదంటే ఆలస్యం కావడం.. త్వరగా నిష్క్రమించడం.. తక్కువ వర్షాలు కురవడం.. అనిశ్చితి వర్షాలు.. పంట కాలంలో దీర్ఘకాలం బెట్ట పరిస్థితులు ఏర్పడటం.. ఒక్కోసారి విరామం లేకుండా అతివృష్టి సంభవించడం లాంటివి వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఎంత వర్షం కురిసినా అందులో 10 నుంచి 20 శాతం మాత్రమే భూమిలోకి ఇంకిపోయి మిగతాది ప్రవాహం, ఒరవడి రూపంలో బయటకు వెళ్లి వృథా అవుతుంటాయి. ఇలా ప్రవాహం రూపంలో వెళ్లే వర్షపునీటితో పాటు భూమిపై సారవంతమైన పొర కొట్టుకుపోవడం వల్ల పోషకాల లోపం ఏర్పడి క్రమంగా భూమి ఉత్పాదకశక్తి కోల్పోయి పంట దిగుబడులు తగ్గిపోతున్నాయి.

లోదుక్కులతో విస్తృత ప్రయోజనాలు

వేసవిలో కురిసే ఇలాంటి వర్షాలను ఉపయోగించుకుని పొలాల్లో వాలుకు అడ్డంగా ఎర్రనేలలో ఒక మీటరు, నల్లరేగళ్లలో రెండు మీటర్లు లోతుగా దుక్కులు చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీన్నే కాంటూరు సేద్యం అంటారు. భూమిలో గట్టిపొరను కదలించడం ద్వారా కోశస్థ దశలో ఉన్న పంటలకు కీడు చేసే పురుగులు చాలా వరకు నశిస్తాయి. వచ్చే పంట కాలంలో చీడపీడలు, తెగుళ్ల ఉధృతి బాగా తగ్గుతుంది. నేల ఎండుతూ ఆరుతూ ఉంటే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి. అలాగే వర్షపు నీరు ఎక్కడికక్కడ ఇంకిపోయి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. భూమి గుల్లబారిపోతుంది. బెట్ట పరిస్థితులు ఏర్పడినా కొంతకాలం పాటు పంటలను కాపాడుకోవచ్చు. సారవంతమైన మట్టి కొట్టుకుపోకుండా అరికట్టవచ్చు. కలుపు సమస్య కూడా బాగా తగ్గిపోతుంది. అంతేకాకుండా గాలిలో నైట్రేట్ రూపంలో ఉన్న నత్రజని వర్షపు నీటితో పాటు నేలకు అందడం ద్వారా భూసారం పెరుగుతుంది. ఇలా విత్తనం వేయడానికి ముందుగా రెండు మూడు సార్లు నేలను బాగా దుక్కి చేసుకుంటే రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

క్లుప్తంగా

ఘనంగా వైశాఖ పౌర్ణమి



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం వైశాఖ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకుడు బసవరాజ స్వామి ఆధ్వర్యంలో సంపదల వ్రతంగా చెప్పబడే ఐశ్వర్యేశ్వర వ్రతం నిర్వహించారు. అలాగే మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, అశోక్‌నగర్ రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయం, ఆదిమూర్తి నగర్ మూడవ రోడ్డు బాబా మందిరాల్లో సామూహిక సత్యదేవుడి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వందలాది మంది భక్తులు నియమనిష్టలతో వ్రతాన్ని ఆచరించారు. అభిషేకాలు, అలంకార సేవలు, విశేష పూజల అనంతరం ప్రసాదం అందజేశారు.

ఆర్థికసాయం అందజేత



ఈశ్వరమ్మకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన నిరుపేద కుటుంబానికి అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. ఇదే గ్రామానికి చెందిన రామిరెడ్డి సోమవారం మృతి చెందడంతో సమాచారం అందుకున్న గ్రామ నాయకులు ఈ.నాగార్జున రెడ్డి, టీ.ఆదినారాయణ రెడ్డి, సీఆర్‌పీఎఫ్ రిటైర్డ్ హెచ్‌సీ వై. ఓబిరెడ్డి, ఈ.సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ హెచ్.నాగరాజు, వడ్డే బాల, కురుబ గుల్లే రాము తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. రామిరెడ్డి భార్య ఈశ్వరమ్మకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కాగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళ సమాఖ్య నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు వేతనం పెంచాలి. బకాయిపడ్డ వేతనం చెల్లించాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతి ప్రసాద్, పద్మావతి డిమాండ్ చేశారు. ఉపాధి పథకం కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకురాళ్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. పేదలకు వరంగా ఉన్న ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వాలు మానుకుని బలోపేతం చేయాలన్నారు. పని దినాలు పెంచి మరింత భరోసా కల్పించాలన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీ ధర పెంచాలన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందజేశారు.

అనంతపురం అర్బన్: ఉపాధి కూలీలకు బకాయిలు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా మార్చి నుంచి ఇప్పటి వరకు నాలుగు వారాల డబ్బులు మాత్రమే చెల్లించారన్నారు. ఇంకా ఆరు వారాల మొత్తం చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సంగప్ప నాయకులు మలరాయుడు, కుళ్లాయప్ప, రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

దరూర్ పుల్లయ్య మృతి బాధాకరం

అనంతపురం అర్బన్: మాజీ ఎంపీ దరూర్ పుల్లయ్య మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ సంతాపం తెలియజేశారు. జిల్లాకు ఆయన ఎనలేని సేవలు అందించారని సోమవారం వారు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా తాగునీరు, హంద్రీ-నీవా ప్రాజెక్టు సాధన, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. రెండుసార్లు ఉరవకొండ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు ఎంపీగా పని చేశారన్నారు. డాక్టర్ శ్రీరామకృష్ణయ్య స్మారక ట్రస్టు, వీకే ఆదినారాయణరెడ్డి ట్రస్టుకు అధ్యక్షుడిగా పని చేశారని తెలిపారు.

సీపీఎం సంతాపం

అనంతపురం అర్బన్: మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య ఆకస్మిక మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సాధనకు ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీలతో చర్చించడం, అభిప్రాయాలు పంచుకోవడంతో ఆదర్శనీయమైన రాజకీయం చేశారన్నారు.



రాప్తాడు గ్రంథాలయంలో గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు



కనగానపల్లి గ్రంథాలయంలో కోలాటం నేర్చుకుంటున్న దృశ్యం



కనగానపల్లి గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

విజ్ఞానం.. వినోదం

- విజ్ఞాన సముపార్జనలో బాల బాలికలు
- చదువుతో పాటు పలు నైపుణ్యాల్లో శిక్షణ
- వేసవిని ఆస్వాదిస్తున్న విద్యార్థులు

రాప్తాడు: నిత్యం పాఠ్య పుస్తకాలతో కుస్తీ పడుతూ ఏడాదంతా కష్టపడిన విద్యార్థులు.. పరీక్షల అనంతరం వేసవి విరామాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సెలవుల్లో చిన్నారులు పుస్తక పఠనం, విజ్ఞానం పెంపొందించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. విజ్ఞానం, వినోదం, సంగీతం, నృత్యం, ఇంగ్లిష్ భాష, భావ వ్యక్తీకరణ తదితర అంశాలపై పట్టు సాధిస్తున్నారు. బాల సాహిత్యం, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి పెంపొందించే పుస్తకాలను చదువుతున్నారు. గ్రంథాలయాల్లో స్టోరీ టెల్లింగ్ (ఆకట్టుకునేలా కథలు చెప్పడం) నీతి కథలు, మానవీయ ప్రవర్తన, ఎదుట వ్యక్తిని ఆకట్టుకునేలా కథలు చెప్పడం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడటం, నృతం తదితర అంశాల్లో నిపుణులైన ఉపాధ్యాయులు రిసోర్స్ పర్సన్లను ఏర్పాటు చేసి తరగతులు చెప్పిస్తున్నారు. కనగానపల్లి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా గురువు సుబ్బరాయుడు, కోలాటం మాస్టారు వినయ్, ఆకట్టుకునే కథలు, తెలుగు గ్రామర్ చెప్పే ట్యూటర్ నరేష్, గణిత ఉపాధ్యాయుడు రామాంజినేయులు గణితంపై మెలకువలు నేర్పిస్తున్నారు. శిబిరానికి హాజరైన విద్యార్థులకు బహుమతులు బిస్కెట్లు, అరటి పండ్లు అందిస్తూ ఉత్సాహపరుస్తున్నారు.

ప్రత్యేక తరగతుల నిర్వహణ ఇలా..

- ఉదయం 8 నుంచి 8:30 గంటల వరకు కథలు చదివి వినిపించడం
- 8:30 నుంచి 10 గంటల వరకూ పుస్తక పఠనం
- 10:10 నుంచి 10:30 గంటల వరకు పుస్తక సమీక్ష
- 10:30 నుంచి 11 గంటల వరకూ కథలు చెప్పడం
- 11 నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే, ఇతర నైపుణ్య శిక్షణ

కథలంటే చాలా ఇష్టం



నాకు కథలంటే చాలా ఇష్టం. శిక్షణ తరగతుల్లో ఎంతో ఆసక్తి కలిగించే కథలు చెబుతున్నారు. మంచి కథల పుస్తకాలు చదువుతున్నాను. నీతి కథలు చాలా బాగున్నాయి. ఇంగ్లిష్, సైన్స్ తదితర అంశాలను వివరిస్తున్నారు. ఇవి భవిష్యత్‌లో నాకు ఎంతగానో ఉపయోగపడతాయి. నాలెడ్జ్ పెంచుకుంటున్నాను.

– హని, 7వ తరగతి, రాప్తాడు

బొమ్మలు వేస్తున్నా



చిత్రలేఖనంపై ఆసక్తితో గ్రంథాలయంలో ఇస్తున్న శిక్షణకు వెళ్తున్నాను. వివిధ రకాల బొమ్మలు వేయడం నేర్చుకుంటున్నా. పేపర్‌తో పలు రకాల ఆకృతులు తయారు చేయడం బాగుంది. సులభంగా బొమ్మలు ఎలా వేయాలో చెబుతున్నారు. ఇలాంటి మెలకువలు తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– వర్షిత్, 5వ తరగతి, రాప్తాడు

ధైర్యంగా మాట్లాడుతున్నా..



వేసవి శిక్షణ తరగతులు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. నాతో మాట్లాడిస్తున్నారు. అందువల్ల నాలో స్టేజ్ ఫియర్ పోతోంది. కథల పుస్తకాలు చదివి వినిపిస్తున్నాను. ఇలా చేయడం వల్ల నాలో తెలియని అనుభూతి కలుగుతోంది. ఈ శిబిరం నాకు ఎంతో ఉపయోగపడుతోంది.

– భవిష్య, 5వ తరగతి, రాప్తాడు

విజ్ఞానం పెంచుకోవాలి



విద్యార్థులకు చదువుతో పాటు ఇతర నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. బాల్యం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి. స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే, ఇతర నైపుణ్య శిక్షణ విద్యార్థులకు ఉపయోగపడుతుంది.

– దాసరి గోవింద్, గ్రంథాలయాధికారి, కనగానపల్లి

పోరాటయోధుడు మురళి నాయక్



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ కేఎస్ఎస్, ఆస్పత్రి అడ్మిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత



మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అనంతపురం క్లబ్ సభ్యులు, మాజీ సైనికులు



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు: వీర జవాన్ మురళి నాయక్ మృతి యావత్ భారతదేశానికి దిగ్భ్రాంతి కలిగించింది. మురళి నాయక్ పోరాట స్ఫూర్తిని దేశం మరువదని ఆటో నగర్ యూనియన్ ప్రెసిడెంట్ షామీర్, వైస్ ప్రెసిడెంట్ బాబు అన్నారు. సోమవారం సాయంత్రం రాప్తాడులో ఆటో నగర్ యూనియన్ నాయకులు, మెకానిక్‌లు, కార్మికుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. 25 ఏళ్ల వయస్సులో దేశం కోసం అమరుడైన మురళి కుటుంబాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కరీం, ప్రభాకర్, రాజా రెడ్డి, శివారెడ్డి, వలి, జిలాన్ బాషా, శివ, అల్లాబకాస్, బాబా పక్రుద్దీన్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వజనాస్పత్రిలో రక్తదాన శిబిరం

అనంతపురం మెడికల్: ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన మురళి నాయక్ సేవలు మరువలేనివని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. వీర జవాన్ మురళి నాయక్, బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఇంతియాజ్, పెహల్గాం ఘటనలో మృతి చెందిన వారికి సోమవారం ఆస్పత్రిలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, సైకియార్టిస్ట్ డాక్టర్ వరదరాజులు, చిన్నపిల్లల విభాగంలోని కొందరు పీజీలు, హౌస్‌సర్జన్లు కలుపుకుని మొత్తం 101 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, వైద్య సిబ్బంది గీత, మహేష్, కామేష్, స్టాఫ్‌నర్సు సుజాత తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుడికి ఘన నివాళి

అనంతపురం: అనంతపురం క్లబ్‌లో సోమవారం జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి క్లబ్ సభ్యులు, మాజీ సైనికులు ఘనంగా నివాళులర్పించారు. పాకిస్తాన్ ముర్దాబాద్.. మురళి నాయక్ జోహార్.. జోహార్ అంటూ నినాదాలు చేశారు. క్లబ్ సెక్రెటరీ కేశవ రెడ్డి మాట్లాడుతూ.. మురళి నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. చిన్నతనంలోనే ఇంత పెద్ద యుద్ధంలో పాల్గొని అమరులైన మురళి నాయక్ తెగువ గర్వకారణమని కొనియాడారు. క్లబ్ సభ్యుడు శ్రీనివాస రెడ్డి అమర సైనికుడు మురళి నాయక్‌పై కవిత్వం వినిపించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ దూదేకుల షేకన్న, మాజీ సైనికులు సిద్దన్న, కరణం కృష్ణ, ఈ. నాగిరెడ్డి, మహమ్మద్ గౌస్, బీఏ హుస్సేన్, బాలస్వామి, ఈశ్వరయ్య, రాంగోపాల్, బండి వెంకటరమణ, యస్ ఖాజామొద్దీన, అబూ సాలేహ, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు నష్టం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: ముస్లింలపై కూటమి ప్రభుత్వ పెద్దలు వక్ఫ్ సవరణ చట్టాలను బలవంతంగా రుద్దుతున్నారని మేయర్ వసీం మండిపడ్డారు. సోమవారం యునైటెడ్ జేఏసీ, మానవ హక్కుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఈద్గా మసీదు ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. జేఏసీ సభ్యులైన వివిధ పార్టీల నాయకులతో కలసి మేయర్ వసీం మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్ సవరణ చట్టాలను తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలు తమ ఆస్తులపై పూర్తిగా హక్కులు కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వెలిబుచ్చారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. జేఏసీ నాయకులు జాఫర్, నదీమ్ అహ్మద్, కాగజ్‌ఘర్ రిజ్వాన్, దాదాగాంధీ, గోల్డ్‌బాషా, ఖాజా హుస్సేన్, జాకీర్, అజీజ్, కొర్రపాడు హుస్సేన్‌పీరా, ఏకేఎస్ ఫయాజ్, వలీ, ఐఎంఎం బాషా, సైపుల్లా బేగ్, జావీద్, కార్పొరేటర్ కమల్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ముంచేలా కూటమి పాలన



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. ఇటీవల మాజీ మంత్రి విడదల రజిని, వైఎస్సార్‌సీపీ మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాయలంలో విలేకరులతో మాట్లాడారు. సభ్య సమాజం తలదించుకునేలా కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు వస్తూ.. పోతుంటాయని పోలీసులు ఆ విషయాన్ని గ్రహించి చట్టానికి లోబడి నడుచుకోవాలని హితవు పలికారు. కొందరు పోలీసుల తీరుతో పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కల్గుతోందన్నారు. ఇక ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు అలివిగాని హామీలు ఇచ్చి.. ఇంత వరకూ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. 11 నెలల కాలంలో రూ.1.54 లక్షల కోట్లు అప్పు చేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ముంచేలా కూటమి ప్రభుత్వ పాలన ఉందన్నారు. పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు, లోకేష్ చెప్పిన విధంగా రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు పోలీసులు పరోక్షంగా సహకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్ భూషణ్, నాయకులు కాకర్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి

చెన్నేకొత్తపల్లి: పేద ప్రజలకు సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. దామాజిపల్లి గ్రామానికి చెందిన పలువురు మహిళలు సోమవారం ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నేకొత్తపల్లి బస్టాండ్ నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. ఆర్డీటీ సేవలు కొనసాగించాలి.. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

అక్క దేవతల జాతర ప్రారంభం



చెరకును జల్దికి తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో సోమవారం అక్క దేవతల జాతర ప్రారంభమైంది. జాతర సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం ఉరుములతో చెరకు తెచ్చి పూజలు చేపట్టిన అనంతరం జల్ది పూజకు వెళ్లారు.మంగళవారం జల్దిపూజ నిర్వహించిన అనంతరం గ్రామంలోని అక్కమ్మ దేవతల గంపను గుడికి చేరుస్తారు. బుధవారం పన్నారపు బండ్ల ఊరేగింపు, 15వ తేదీన అమ్మవారికి పసుపు, కుంకుమలతో వసంతోత్సవ కార్యక్రమంతో జాతర ముగుస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.



విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం



అలంకరణలో అక్క దేవతలు



హంపాపురం గ్రామంలో పాత అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ప్రమాదకరంగా ఉన్న గుంత

తవ్వారు.. వదిలేశారు

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామంలో పాత అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఎస్సీ కాలనీలో రెండు నెలల క్రితం పైప్ లైన్ ఏర్పాటు కోసం పంచాయతీ అధికారులు పెద్ద గుంత తవ్వారు. పైప్‌లైన్ ఏర్పాటు చేసిన అనంతరం గుంతను అలాగే వదిలేశారు. ప్రధాన రోడ్డు పక్కనే పెద్ద గుంత ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు, వాహనాదారులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గుంతను పూడ్చి వేయాలని వాహనాదారులు, ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

గంజి నీలిమకు డాక్టరేట్



అనంతపురం: రాఘవేంద్ర ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న గంజి నీలిమకు డాక్టరేట్ ప్రదానం చేశారు. జేఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ మైసూర్ అసోసియేట్ ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ సవిత పర్యవేక్షణలో ఫార్మా డీ విభాగంలో 'ఎవాల్యూషన్ ఆఫ్ ఫార్మా సూటికల్ కేర సర్వీసెస్ ఇన క్రిటికల్ హాస్పిటల్ బేస్డ్ ఇంటర్వెన్షనల్ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఫార్మా డీ రంగంలో మరిన్ని మెరుగైన పరిశోధనలు చేసి, తక్కువ ధరకే పేదలకు మందులు అందించాలన్న లక్ష్యంతో కృషి చేస్తానని నీలిమ పేర్కొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం కల్చరల్: నగరంలోని ఎండోమెంటు పరిధిలోని ప్రాచీన దేవాలయమైన పాతూరు చెన్నకేశవ దేవాలయం, సోములదొడ్డిలోని అశ్వర్థ నారాయణ స్వామి ఆలయానికి సంబంధించి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ వెలవడినట్లు ఈఓ సుధారాణి తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 26 తేదీలోపు తమ వివరాలను జిల్లా కేంద్రంలోని సహాయ కమిషనర్ ఎండోమెంటు కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

'సమ్మె ఉధృతం చేస్తాం'

అనంతపురం అర్బన్: కార్మికుల వేతన బకాయిలు చెల్లించడంతో పాటు, ఇతర సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఉధృతం చేస్తామని శ్రీరామరెడ్డి నీటి సరఫరా పథకం కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు ఓబులు సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వేతనాలు, పీఎఫ్ బకాయిల విషయంపై కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కలెక్టర్ తనకు సోమవారం ఫోన్ చేశారని.. మోటర్లు ఆన్ చేయకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారన్నారు. కార్మికులకు సంబంధించి 10 నెలల వేతనాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించని వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని కలెక్టర్‌ను అడుగుతున్నామన్నారు. బకాయిలు కార్మికుల ఖాతాల్లో జమ చేసే వరకూ సమ్మె కొనసాగుతుందని ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు తెలియజేస్తున్నామన్నారు.


భక్తిశ్రద్ధలతో బుద్ధ జయంతి



త్రిపీటకాలను పఠిస్తున్న మహాబోధి సభ్యులు

అనంతపురం కల్చరల్: జగతికి జ్ఞాన రేఖలను ప్రసరింపజేసిన బుద్ధుడి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బుద్ధ విహార్ పార్కులో బౌద్ధ వాంజ్మయంలోని త్రిపీటకాలను పఠించారు. బుద్ధ వందనంలో కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా నుంచి విచ్చేసిన ఈశ్వర్‌రెడ్డి ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం బుద్ధ పౌర్ణమికి గుర్తుగా చిన్నారులతో కలిసి జ్ఞానజ్యోతులను వెలిగించారు. కార్యక్రమంలో మహాబోధి సాహితీ వేదిక అధ్యక్షుడు మహాబోధి కృష్ణమూర్తి, బౌద్ధమత అనుయాయులు ప్రధాన కార్యదర్శి మిద్దె రవీంద్ర, ఉపాధ్యక్షులు ఎమ్మెస్ రామాంజనేయులు, ఫౌండర్ మెంబర్ విజయ్‌కుమార్, సత్యనిరార్ధరన్, బౌద్ధమతాన్ని అధ్యయనం చేస్తున్న బాలకొండన్న, సోము, ఇందీవర్, రాఘవేంద్రమ్మ, శ్రీశక్తి సునీత, అక్ష, న్యాయవాది హరి, కిషోర్ పాల్గొన్నారు.

సర్వజనాస్పత్రికి మంచి పేరు తీసుకొద్దాం



కేక్ కట్ చేస్తున్న గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి

అనంతపురం మెడికల్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించి ప్రభుత్వ సర్వజనాస్పత్రికి మంచి పేరు తీసుకువద్దామని గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి గ్రేడ్-1తో పాటు హెడ్ నర్సులు, స్టాఫ్‌నర్సులు క్యాండిల్‌తో నివాళులర్పించారు. అనంతరం ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం హాల్‌లో సమావేశమయ్యారు. గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి మాట్లాడుతూ.. సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రోజూ 5 వేల మంది రోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలందుతున్నాయన్నారు. రోగులు త్వరగా కోలుకోవడంలో స్టాఫ్‌నర్సుల పాత్ర మరువలేనిదన్నారు. క్యాజువాలిటీకి వచ్చే క్షతగాత్రులు, అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో రౌండ్ ద క్లాక్ స్టాఫ్‌నర్సులు రోగులకు వైద్య సేవలందించి వారి ప్రాణాలు కాపాడుతున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ముందు మరిన్ని సేవలందిద్దామన్నారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సుల అసోసియేషన్ అధ్యక్షురాలు ఆర్‌బీ పద్మ, కార్యదర్శి లత, ఉపాధ్యక్షురాలు భానులత, ఏపీ హంస రాష్ట్ర సహాయ కార్యదర్శి కే చాముండేశ్వరి, హెడ్‌నర్సులు పద్మజ, మహాలక్ష్మి, గౌరి, స్టాఫ్‌నర్సులు లలిత, రేష్మ, అర్షియా, మంగమ్మ, నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.